సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

జాప్యమెందుకో..?



శిథిలావస్థలో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ భవనం


కూలే స్థితిలో మెట్లు

- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టాలని సీపీ ఆదేశం
- మూడు నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- శిథిల భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు
- స్టేషన్‌లోకి వెళ్లేందుకు భయపడుతున్న ప్రజలు

బీచ్‌రోడ్డు: ప్రజలకు రక్షణ కల్పిస్తున్న రక్షకభటులకే రక్షణ కరువైంది. వారు విధులు నిర్వర్తిస్తున్న భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. శిథిలావస్థకు చేరిన ఆ స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రజలు సైతం భయపడుతున్నారు. నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన మూడో పట్టణ పోలీస్ స్టేషన్ దుస్థితి ఇది. ఈ స్టేషన్ మొత్తం శిథిల స్థితికి చేరింది. గోడలు ఎక్కడికక్కడ బీటలు వారాయి. మెట్లు ధ్వంసమయ్యాయి. భవనం ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి. దీంతో పోలీసులు స్టేషన్‌లో భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. వర్షాలు కురుస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పోలీస్ సిబ్బంది, ఫిర్యాదుదారుల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వారంలో మరమ్మతులు చేపట్టాలని ఆదేశం

మూడు నెలల కిందట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ భవనం పరిస్థితిపై ఆరా తీసిన నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అప్పటి సీఐ పార్థసారథి మరమ్మతుల అంచనా వ్యయం కోసం కాంట్రాక్టర్‌ను రప్పించారు. ఆయన వచ్చి స్టేషన్ మొత్తం పరిశీలించి అంచనా వేసి సీఐకు తెలియజేశారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని అనుకున్నారు. ఏం జరిగిందో తెలియదు కానీ ఆ పనుల్లో ఎటువంటి కదలిక రాలేదు.

పనులు ప్రారంభించేదెప్పుడో..?

పోలీస్ కమిషనర్ స్వయంగా వారం రోజుల్లో స్టేషన్ భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించడంతో సిబ్బంది అంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇక నిర్భయంగా విధులకు హాజరు కావచ్చని భావించారు. సీపీ ఆదేశించి మూడు నెలల గడుస్తున్నా.. మరమ్మతుల ఊసే లేదు. దీంతో సీపీ ప్రచారం కోసం ఆదేశించారా.. లేక ఆయన ఆదేశాలపై అధికారులు అలసత్వం వహిస్తున్నారో అర్థం కాని పరిస్థితి. దీంతో భవన మరమ్మతు పనుల్లో జాప్యం నెలకొంది.

భయం భయంగా స్టేషన్‌లోకి..

మూడో పట్టణ పోలీస్ స్టేషన్ భవనంలోనే ద్వారకా ఏసీపీ కార్యాలయం, ఎంవీపీ క్రైం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు కూడా ఉన్నాయి. దీంతో నిరంతరం అనేక మంది ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు ఈ కార్యాలయాలకు వస్తుంటారు. ఈ భవనం ఎటు చూసినా పగుళ్లు, పెద్ద పెద్ద రంధ్రాలతో ఉండటంతో ప్రజలు లోపలికి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ గోడ కూలిపోతుందో తెలియని పరిస్థితుల్లో ఉండటంతో వీలైనంత వేగంగా అక్కడ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు తక్షణం మరమ్మతులు చేపట్టి సిబ్బందికి, ప్రజలకు భరోసా కల్పించాలని ఉన్నతాధికారులను స్థానికులు కోరుతున్నారు.




బీటలు వారిన పోలీస్ స్టేషన్ గోడలు

ప్రజా పోరాటాలకు సిద్ధం కండి


మాట్లాడుతున్న సీపీఎం ఫ్లోర్ లీడర్ గంగారావు

ఆరిలోవ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలకు అంతా సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు బి.పద్మ, సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ సీపీఎం జోన్‌ల ఆధ్వర్యంలో ఎనిమిదో మహా సభ బుధవారం తోటగరువు ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ రెడ్డిపల్లి బాబూరావు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోపాటు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్.పి.రాజు, వి.కష్ణమూర్తి, తవిటినాయుడు, రమణమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సమస్యలను పట్టించుకునే ప్రభుత్వాలు, పార్టీలు లేవన్నారు. సీపీఎం మాత్రమే ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు చేస్తోందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెనుభారాలు మోపడానికి సిద్ధమవుతున్నాయన్నారు. మరో వైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యవహారం వేగవంతం చేశారన్నారు. ఆరిలోవ ప్రాంతంలో ప్రభుత్వ భూములను రాజకీయ రాబందులు కాజేయడానికి ప్రయత్నిస్తున్నా యని ఆరోపించారు. వచ్చే ఏడాదిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు భారీగా పెంచడానికి సన్నాహాలు చేస్తున్నాయన్నారు. రానున్న రోజుల్లో ధరలు భారీగా పెరగడం, నిరుద్యోగం పెరగడం తదితర పర్యవసానాలను ఎదుర్కోబోతున్నట్లు చెప్పారు. అనంతరం సభలో మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడ జోన్‌లను కలిపి మద్దిలపాలెం జోన్‌గా ఏర్పాటు చేశారు. దీనికి కొత్తగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, జగన్, జిల్లా కమిటీ సభ్యురాలు మణి, జోన్ సభ్యులు పాల్గొన్నారు.

యువతలో మంచి మార్పు తీసుకురావాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

విశాఖ సిటీ: యువతలో మంచి మార్పును తీసుకొచ్చేలా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు పనిచేయాలని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు సూచించారు. ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ సమావేశ మందిరంలో హెరిటేజ్ ఫౌండేషన్‌తో సంయుక్తంగా బుధవారం ప్రోగ్రాం అధికారులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటిని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విభిన్న తరాల మనుషుల్లో వస్తున్న మార్పులను సునిశితంగా పరిశీలించాలన్నారు. వృద్ధులను సమాజానికి ఉపయుక్తంగా చేసుకుంటూ, వారి నుంచి విలువలు, క్రమశిక్షణ నేటి తరానికి అందించడం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ మాట్లాడుతూ నేడు వృద్ధులు ఒంటరిగా మారిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వారు సామాజిక, మానసిక, ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపే విధంగా యువతను వృద్ధులతో అనుసంధానం చేయడమే సరైన పరిష్కారమని వివరించారు. హెరిటేజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.ఆర్.గంగాధరన్ మాట్లాడుతూ ఒకరిని మరొకరు అర్థం చేసుకుంటే సమస్యను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. వృద్ధుల సంఖ్య పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో సైతం పెరుగుతోందని చెప్పారు. ప్రజల జీవన, ఆరోగ్య ప్రమాణాలు కూడా పెరగడం దీనికి ఒక కారణంగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా సమన్వయకర్తలు, ఆచార్య ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో డిసెంబర్ 5 నుంచి 7 వరకు 'నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ క్యాటలిసిస్ అండ్ ఎన్విరాన్మెంట్' అనే అంశంపై నిర్వహించనున్న జాతీయ సదస్సు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఎస్‌టీ-ఫిస్ట్ పథకంలో భాగంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఇందులో నానో మెటీరియల్స్, క్యాటలిసిస్, ఫొటో క్యాటలిసిస్, బయోమాస్ కన్వర్షన్ తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు, పరిశోధనా పత్రాల సమర్పణ ఉండనున్నాయి. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, విభాగ ఆచార్యులు పి.శ్యామల, బి.బి.వి.శైలజ, వి.సిద్ధయ్య, జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై విద్యార్థుల ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-8లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఆధ్వర్యంలో బుధవారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమం నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జాతి శ్రేయస్సు కోసం సమగ్రత-సంస్కృతి అనే అంశంపై పలువురు అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశ సమగ్రత, సమానత్వం, అభివృద్ధిలో ప్రతి విద్యార్థి భాగం కావాలని సూచించారు. ఈ అంశంపై ఇటీవల గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ కళాశాలలో జరిగిన రోల్‌ప్లేలో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యావిహార్ ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

బీచ్‌రోడ్డు: పలు వస్తువులను దొంగలించిన వ్యక్తిని మూడో పట్టణ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైం ఎస్ఐ సల్మాన్ తెలిపిన వివరాలిలా.. రామ్‌నగర్‌కు చెందిన నంద రూబిన్ అనే వ్యక్తి అదే ప్రాంతంలోని ఓమ్నీ ఆర్కే ఆస్పత్రి స్టోర్ రూంలో మంగళవారం ఫ్యాన్లు, బెడ్లకు సంబంధించిన సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులను దొంగలించి పారిపోయాడు. ఈ విషయమై ఆస్పత్రి యాజమాన్య ఫిర్యాదు చేయగా.. త్రీ టౌన్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి వస్తువులను చోరీ చేసినట్లు రూబిన్‌ను గుర్తించారు. బుధవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జీవీఎంసీ దుకాణాలకు బహిరంగ వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-4, 5 పరిధిలోని వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, మార్కెట్లకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు ఆయా జోనల్ కమిషనర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్-4లో డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, జగదాంబ వాణిజ్య సముదాయం, పాతబస్టాండ్ ఫేస్-2, పద్మానగర్ వాణిజ్య సముదాయం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయం, అంబేడ్కర్ కల్యాణ మండపం, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి (రోడ్ సైడ్) ఫిష్ మార్కెట్లకు మూడేళ్ల కాల పరిమితికి అద్దెకిచ్చేందుకు ఈ నెల 14 ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందని జెడ్సీ మల్లయ్యనాయుడు తెలిపారు. జోన్-5లో 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాలు, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్ దుకాణం-1, 51వ వార్డు మాధవస్వామి కల్యాణ మండపం, కంచరపాలెం, అక్కయ్యపాలెం రోడ్ సైడ్ మార్కెట్లకు ఈ నెల 16 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తామని జెడ్సీ బి.రాము చెప్పారు.

భారీ వాహనాల రాకపోకలు నిషేధం

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెం, పిఠాపురం కాలనీ ప్రాంతాల్లో భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్లు పాడైపోవడంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలపై 'ఇరుక రహదారుల్లో భారీ వాహనాలు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. దీనిపై ఎంవీపీ పోలీసులు స్పందిస్తూ ఆ ప్రాంతాల్లో భారీ వాహనాల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. ఎవరైనా భారీ వాహనాలను తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే విషయాన్ని భవనాలు నిర్మిస్తున్న యాజమాన్యాలకు పోలీస్ సిబ్బంది ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.

సాంస్కృతిక సమైక్యత దేశ ప్రగతికి మూలం


బహుమతులు సాధించిన విద్యార్థులతో యూనియన్ బ్యాంక్ మేనేజర్ అనీఫ్

ఏయూక్యాంపస్: సాంస్కృతిక సమైక్యత దేశ ప్రగతికి మూల స్తంభమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈస్ట్ పాయింట్ కాలనీ బ్రాంచ్ ప్రధాన మేనేజర్ మహమ్మద్ అనీఫ్ అన్నారు. అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా బుధవారం బీచ్ రోడ్డులోని ఎంఎల్‌బీటీ పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి అవినీతి రహిత జీవనం అలవాటు చేసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం ముదావహమన్నారు. బ్యాంకు అధికారి సతీష్ మాట్లాడుతూ బాల్యం భావి జీవితాన్ని తేజోమయం చేస్తుందన్నారు. వివిధ పోటీలలో విజేతలైన బాలికలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధురవాణి, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపులో నిర్లక్ష్యం

- జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం బరితెగింపు
- అనధికారిక బడ్డీల ఏర్పాటుదారులతో లాలూచీ


టీటీడీ కల్యాణ మండపం ఎదుట 10 రోజుల కిందట ఏర్పాటు చేసిన అనధికారిక బడ్డీలు


తాజాగా బడ్డీకి బిగించిన షట్టర్

ఎంవీపీకాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎదుట అనధికారిక బడ్డీల తొలగింపులో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం నిర్లక్ష్య ధోరణి సర్వత్రా విమర్శల పాలవుతోంది. ఇప్పటికే ఇక్కడ అనేక అనధికారిక బడ్డీలు ఉండటంతో రహదారికి ఇరువైపులా అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. కల్యాణ మండపం గేటును ఆనుకొని ఇటీవల మరో రెండు బడ్డీలు పెట్టడం మరిన్ని విమర్శలకు తావిచ్చింది. టీటీడీ కల్యాణ మండపం, ఈ కౌంటర్ భవనాల్లోకి వెళ్లాలంటేనే భక్తులకు విస్తుపోతున్నారు. దీనికి తోడు కల్యాణ మండపాన్ని ఆనుకొని విద్యుత్ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి రెండు బడ్డీలు ఏర్పాటు చేయడం పెద్ద దుమారం రేపింది. దీనిపై 10 రోజుల కిందట 'దర్జాగా బడ్డీల ఏర్పాటు' శీర్షికతో 'సాక్షి' వార్తను సైతం ప్రచురించింది. ఈ నేపథ్యంలో అనధికారిక బడ్డీల తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. విభాగం ఉద్యోగులు బడ్డీల ఏర్పాటు దారుడితో లాలూచీ కుదుర్చుకుని చర్యలు తీసుకోకపోడమే ఇందుకు కారణం. ఆయా అనధికారిక బడ్డీలకు బరితెగించి మరీ షట్టర్లు బిగించడం, ఒక బడ్డీ స్థానంలో మరో బడ్డీ ఫ్రేమ్‌ను అక్కడ ఏర్పాటు చేయడమే ఇందుకు నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. వాస్తవానికి అనధికారిక బడ్డీలపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగంపై ఉంది. అధికారుల బదిలీల కారణంగా చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని వెల్లడిస్తూ వచ్చిన ఆ విభాగ ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా ఆయా బడ్డీల ఏర్పాటు దారుడితో తెరవెనుక ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే బరితెగించి మరీ ఆయా బడ్డీలకు అక్కడే షెట్టర్లు బిగించుకునేందుకు సహకరించడంతోపాటు మరో ఐరన్ బడ్డీ ఫ్రేమ్‌ను అక్కడ ఏర్పాటు చేసేందుకు అనుమతిచ్చినట్లు ఆరోపిస్తున్నారు. బడ్డీలను తొలగించకపోగా ఏర్పాటు దారుడితో టౌన్ ప్లానింగ్ ఉద్యోగులు లంచాలు దండుకొని లాలూచీ పడటంపై విమర్శలు గుప్పిస్తున్నారు. గతంలోనూ ఆ విభాగ స్థానిక ఉద్యోగులు ఇదే ధోరణితో వ్యవహరించినట్లు వెల్లడిస్తున్నారు.

ఈ విషయంపై స్థానిక టౌన్ ప్లానింగ్ కార్యదర్శి దివ్య వివరణ కోరేందుకు ఫోన్‌లో 'సాక్షి' ప్రయత్నించగా.. ఆమె అందుబాటులోకి రాలేదు.

పారిశ్రామికవేత్త రామారావు మృతికి సంతాపం


బీవీ రామారావు భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఎంవీపీకాలనీ: పారిశ్రామిక వేత్త బీవీ రామారావు (80) మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. అనారోగ్యం కారణంగా కొన్ని రోజులుగా రామారావు స్థానిక మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం రాత్రి ఆయన మృతి చెందారు. దీంతో వెంకోజీపాలెంలోని ఎంవీపీ ప్రెసిడెన్సీకి ఆయన భౌతిక కాయాన్ని తరలించారు. ఈ సందర్భంగా పలువురు నగర ప్రముఖులు, వ్యాపార వేత్తలు, కుటుంబ సభ్యులు రామారావు భౌతిక కాయం వద్ద బుధవారం ఉదయం నివాళులర్పించారు. పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించడంతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. రామారావుకు భార్య సతీసావిత్రి, కుమార్తె వసంతలక్ష్మి, కుమారుడు బీవీ రామ్ ఉన్నారు. రామారావు భౌతిక కాయాన్ని రాజమహేంద్రవరం తరలించి బుధవారం సాయంత్రం అక్కడే అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వెంకన్న ఆలయంలో తిరునక్షత్ర పూజలు


స్వామికి అభిషేకం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం తిరునక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో కొలువైన శ్రీమణవాళమహాముని వారి వార్షిక తిరునక్షత్రం సందర్భంగా ఉదయం పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చన చేశారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆచార్య ప్రేమానందానికి అభినందన


ఆచార్య ప్రేమానందానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎంవీపీకాలనీ: ఏయూ పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందంకు పలువురు విద్యార్థి సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. ఇటీవల ఆయనను ఏయూ ఆర్ట్స్ కళాశాల చీఫ్ వార్డెన్‌గా ఏయూ ఉన్నతాధికారులు నియమించిన నేపథ్యంలో విభాగంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రేమానందాన్ని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉన్నతికి ఆచార్యుడిగా ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. విభాగాధిపతిగా, వార్డెన్‌గా వర్సిటీ విద్యార్థుల ఉన్నతికి విలువైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్, రాయ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' విద్యార్థులకు వైద్య సేవలు


వైద్యులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శేషమ్మ

మహారాణిపేట: ప్రభుత్వ విజువల్లీ చాలెంజ్డ్ గరల్స్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకు, ఓంకార్ అండ్ లయన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ది డెఫ్ లాసన్స్ బే కాలనీలోని విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు. ఓంకార్ అండ్ లయన్ ఎడ్యుకేషన్ సొసైటీలో 46 మందికి, ప్రభుత్వ విజువల్లీ చాలెంజ్డ్ గర్ల్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 36 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. విశాఖపట్నం డాక్టర్ భారత్, డాక్టర్ కల్యాణి, డాక్టర్ భీమారావు, డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ దీపక్ పాల్గొని వైద్య సేవలందించారు.

9న లేడీస్ పిక్నిక్

సీతంపేట: వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కు సమీపంలోని ఎంజీఎం మైదానంలో ఈ నెల 9న లేడీస్ పిక్నిక్ నిర్వహించనున్నట్లు వీరూమామ తెలిపారు. పౌర గ్రంథాలయంలో బుధవారం కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రతి మహిళకు ఒక రోజు పేరిట విందు, వినోదం, 20కి పైగా ఫన్ గేమ్స్, 500కు పైగా బహుమతులతో ప్రతి ఒక్కరికీ లభించేలా లేడీస్ పిక్నిక్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మిసెస్ ఇండియా హేమలతారెడ్డి మహిళలతో ముచ్చటిస్తారని, పిక్నిక్‌లో పాల్గొనదలచిన మహిళలు 99129 99949 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తల్లిదండ్రుల చెంతకు యువతులు


తల్లిదండ్రులకు యువతిని అప్పగిస్తున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో తప్పిపోయిన ఇద్దరు యువతులను పోలీసులు చాకచక్యంగా పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇటీవల వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు యువతులు ఇంటి నుంచి అలిగి బయటకు వెళ్లిపోయారు. వారి తల్లిదండ్రులు వేర్వేరుగా ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వారి జాడ తెలుసుకున్నారు. మచిలీపట్నం వద్ద ఓ యువతిని, నగర శివారులో మరో యువతిని పట్టుకున్నారు. వారిద్దరినీ బుధవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తక్కువ సమయంలో యువతలను వెతికి పట్టుకున్న ఆరిలోవ పోలీసులను నగర సీపీ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

సంస్థ ఆదాయం పెంపుపై దృష్టి


మాట్లాడుతున్న రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జా బాబూరావు

మద్దిలపాలెం: సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జా బాబూరావు అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా ఆయన విశాఖ జిల్లాలో పర్యటించారు. వివిధ వేర్ హౌస్‌లు, ఇతర కార్యా లయాలను సందర్శించారు. పిఠాపురం కాలనీలోని జనశిక్షణ సంస్థాన్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వీటన్నింటిపై చైర్మన్ మాట్లాడారు. ఎగుమతుల ద్వారా సంస్థ ఆదాయం పెంచుతామని, కన్వెన్షనల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని, అమరావతి, విశాఖ, తిరుపతి పట్టణాల్లో ట్రేడ్ ఎగ్జిబిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ హనుమా నాయక్ మాట్లాడుతూ ఎగుమతులకు అవకాశమిచ్చేలా చర్యలు తీసుకుంటామని, లేపాక్షి, నాంది బ్రాండ్ పేరుతో నోట్ పుస్తకాలు విక్రయిస్తున్నామని చెప్పారు. తమ సంస్థకు గాజువాకలో మూడు గిడ్డంగులు ఉన్నాయని, విశాఖ రేసపువానిపాలెంలో 2.5 ఎకరాల భూమి ఉందని వెల్లడించారు. గాజువాకలో ఉన్న 3.5 ఎకరాల భూమిలో ఎగుమతి గిడ్డంగి ఏర్పాటు చేశామని, దీని ద్వారా బియ్యం ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. సమావేశంలో జనశిక్షణ సంస్థాన్ చైర్మన్ రామరాజు, ప్రోగ్రాం ఆఫీసర్ పాల్గొన్నారు.

దేశభక్తిని చాటిన 'మధురస్వరం'


మధురస్వరం నాటకంలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: పండు ముసలివాళ్లలో సైతం దేశభక్తిని రగిలించే వందేమాతరం గీతాన్ని కథాంశంగా ప్రదర్శించిన మధురస్వరం నాటకం దేశభక్తిని చాటిచెప్పింది. రసజ్ఞ 3వ జాతీయ నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో డాక్టర్ వేమలి త్రినాథరావు దర్శకత్వంలో మధురస్వరం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. నాటకం ఆద్యంతం దేశభక్తిని పెంపొందించేలా ప్రదర్శించిన సన్నివేశాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. దీనికి కథను డి.హేమ వెంకటేశ్వరి సమకూర్చారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com